క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలచెరువు: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ గాయత్రి సోమవారం తెలిపారు. మండలంలోని పెద్ద పాలెం సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు పెద్దమండ్యంలో 'జగనన్నకు చెబుదాం'

పెద్దమండ్యం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోవచ్చని తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. మండల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీసీకే ఆధ్వర్యంలో మనుస్మృతి దహనం

మదనపల్లె : డిసెంబర్ 25న మనుస్మృతి దహన్ దివస్‌ను పురస్కరించుకుని సోమవారం స్థానిక బాస్ కార్యాలయంలో వీసీకే పార్టీ ఆధ్వర్యంలో మనుస్మృతి దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీటీఎం.శివప్రసాద్ మాట్లాడుతూ..దేశంలోని మెజారిటీ ప్రజలకు శూద్రులనే ముద్రవేసి తీవ్రంగా అవమానించడంతో పాటు వారికి విద్య, ఆస్తి హక్కులు నిరాకరించి, ఆత్మగౌరవాన్ని హరించిన మనుస్మృతిలోని పలుశ్లోకాలను వివరించారు. అత్యంత ప్రమాదకరమైన మనువాద భావజాలాన్ని సమూలంగా నాశనం చేయాలన్న ఉద్దేశంతో డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ మనుస్మృతిని దగ్ధం చేసి జ్ఞానకాంతులు వెలిగించారన్నారు. అప్పటి నుంచి డిసెంబర్ 25న మనుస్మృతి దహన దినంగా పాటించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ముత్యాలమోహన్, సొన్నికంటిరెడ్డెప్ప, గిన్నెలమనోహర్‌రెడ్డి, బురుజురెడ్డిప్రసాద్, భార్గవ్, సీహెచ్.రవి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు లక్కీడిప్ డ్రా

మదనపల్లె సిటీ: మదనపల్లె వన్ డిపో కార్యాలయంలో ఈనెల 27వ తేదీన మదనపల్లె–బి.కొత్తకోట బస్సులో ప్రయాణించిన ప్రయాణికుల కోసం లక్కీడిప్ తీయనున్నట్లు మదనపల్లె–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు తమ పేరు, ఊరుపేరు, ఫోన్ నంబర్ వివరాలతో టిక్కెట్టు వెనుకవైపు రాసి గిఫ్టుబాక్సులో వేయాలన్నారు. గెలిచిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రీడలను విజయవంతం చేద్దాం

నిమ్మనపల్లె : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. మంగళవారం ఉదయం 10గంటలకు నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్‌లో క్రీడాపోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీలు జనవరి 9వరకు గ్రామస్థాయిలో జరుగుతాయని, ప్రతిభ చూపిన వారిని జనవరి 10 నుంచి 23వరకు జరిగే మండల క్రీడాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు పోటీలకు హాజరు కావాలని కోరారు.

తిరుప్పావై ప్రవచనాలు



తిరుప్పావై ప్రవచనాలు చెబుతున్న మహిళలు

మదనపల్లె సిటీ: ధనుర్మాస మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక బర్మావీధిలోని షిర్డిసాయిబాబా ఆలయంలో సోమవారం తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. ఆలయ మండపంలో గోదా,రంగనాథుని చిత్రపటాలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. తిరుప్పావైలోని పాసురాలను పఠించారు. మహిళలు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాబు నాయుడు, అర్చకులు రాము పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పీలేరు : ప్రజల భాగస్వామ్యంతో ఫైలేరియా వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బోదకాలు వ్యాధి రహిత సమాజం కోసం, జాతీయ ఫైలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి రెండు రోజుల పాటు గూడరేవుపల్లె, ముడుపులవేముల గ్రామాల్లో రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు బోదకాలు వ్యాధి నిర్ధారణ కోసం రక్తపూతల కార్యక్రమం నిర్వహించాలని వైద్యసిబ్బందికి సూచించారు. బోదకాలు వ్యాధి లక్షణాలు గుర్తిస్తే ముందస్తు నివారణ చర్యలు తీసుకుని వ్యాధి ఉధృతిని తగ్గించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి క్రీస్తు మార్గం అనుసరణీయం



మదనపల్లె: జేసీఎం చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు



మదనపల్లె: భక్తిగీతాలు ఆలపిస్తున్న కొరియర్ బృందం

మదనపల్లె సిటీ: ప్రపంచ శాంతికి క్రీస్తుమార్గం అనుసరణీయమని రాయలసీమ డయాసిస్ బిషప్ ఐజాక్ వరప్రసాద్ తెలిపారు. మదనపల్లె పట్టణం జెసీఎం చర్చిలో సోమవారం క్రిస్మస్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన క్రైస్తవులను ఉద్దేశించి దైవ సందేశం ఇచ్చారు. మానవుల కష్టాలు,పాపాలు తొలగించేందుకే క్రీస్తు మనిషి రూపంలో జన్మించారని, మనందరి పాప భారాన్ని శిలువపై మోసి రక్తాన్ని చిందించారని వివరించారు. క్రీస్తు మార్గంలో అందరూ పయనించాలని సూచించారు. తనకు దైవసందేశం ఇచ్చే అవకాశం ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. డివిజన్ సంఘ కాపరి రెవ.డాక్టర్ సునిల్‌వరకుమార్ మాట్లాడుతూ మానవత్వానికి చెడు నుంచి మంచికి, దురాస నుంచి దాతృత్వం,త్యాగాలను జీసస్ బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో జెసీఎం చర్చి కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి ఆనంద్, వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్, సభ్యులు సూరి తదితరులు పాల్గొన్నారు. మల్లెల ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రిస్మసస్ శుభాకాంక్షలు తెలిపారు. డేవిడ్ సంజయ్ కొరియర్ బృందం ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి.

ఆకట్టుకున్న క్రిస్మస్ ట్రీ

చర్చి ఆవరణంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ ఆకట్టుకుంది. సుమారు 25 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేశారు. క్రిస్మస్ ట్రీ చుట్టూ స్టార్‌లు, బొమ్మలు పెట్టారు. పలువురు క్రిస్మస్ ట్రీ వద్ద సెల్‌ఫోన్‌ల్లో సెల్ఫీలు తీసుకున్నారు. మదనపల్లె మండలం ఆరోగ్యవరంలోని సెయింట్‌లూక్ చర్చిలో ఏర్పాటు చేసిన ఏసు జననం సెట్టింగ్ ఆకట్టుకుంది.

ఆరోగ్యవరంలో...

మదనపల్లె మండలం ఆరోగ్యవరంలోని మెడికల్ సెంటర్‌లోని చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెయింట్‌లూక్, గుడిసివారిపల్లె, ఆరోగ్యమాత చర్చి, కురవంక, ఈస్టుపేట, శేషప్పతోట, బాకావానితోట ప్రాంతాల్లోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి.

వైభవంగా క్రిస్‌మస్ వేడుకలు

రామసముద్రం: మండలంలో క్రిస్‌మస్ వేడుకలను సోమవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వనగానిపల్లె గ్రామంలో ఉన్న ప్రేమ స్వరూపి ప్రార్థమ మందిరంలో ఫాస్టర్ చంద్రకిరణ్ మాట్లాడుతూ ప్రభువైన యేసుక్రీస్తు చల్లని దీవెనెలు ప్రజలందరిపై ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్‌మస్ పండుగ సందర్భంగా అనాథలకు దుస్తులు పంపిణీ చేశారు. సోమశేఖర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ, నక్కలవారిపల్లె గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం క్రిస్మస్ సందర్భగా చర్చిలన్నింటిని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. చర్చిల్లో కేక్‌లు కట్‌చేసి ఒకరికొకరు పండుగ శుభకాంక్షలు చెప్పుకొన్నారు. అన్ని చర్చిల్లోను పాస్టర్లు ఏస్తుక్రీస్తు సందేశాలను చదివి వినిపించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కేవీపల్లెలో..

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె, గర్నిమిట్ట సెయింట్ పాల్స్ మిషన్ చర్చి, గుండ్రేవారిపల్లె వీఆర్‌ఐఎం చర్చి, వగళ్లలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు మాట్లాడుతూ లోక రక్షకుడు యేసు ప్రభువేనని, ప్రజల రక్షణ కోసం జన్మించాడని తెలిపారు. కార్యక్రమంలో వగళ్లలో చర్చి పాస్టర్ బి. జర్మియా, గుండ్రేవారిపల్లె చర్చి పాస్టర్ విజయ్‌కుమార్ పలువురు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

పీలేరు రూరల్ : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పీలేరు పట్టణంలోని స్టీన్‌పాల్స్ ప్రార్థన మందిరం తోపాటు ఏసీఎల్‌ఎం చర్చి, లూథరన్, హెబ్రోన్, రెహబోతు, ఇమానియేల్, షకీనా, లవ్ ఆఫ్ జీసస్, బెతెస్తా తదితర చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు చూపించిన మార్గంలో నడవాలని సూచించారు. అలాగే మండల పరిధిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఏసీఎల్‌ఎం చర్చిలో దుస్తులు పంపిణీ చేశారు.

క్రీస్తు విధేయులే క్రైస్తవులు

ప్రపంచానికి కొత్త మార్గం చూపిన క్రీస్తు

కురబలకోట: యేసు క్రీస్తుకు లోబడి నడచుకోవడమే అసలైన క్రిస్మస్ అని కర్నూలులోని యెరూషలేము ప్రార్థన మందిరం దైవ సేవకులు విక్టర్ శ్యామ్యూల్ పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన వాక్యోపదేశం చేశారు. మండలంలోని కామూరివారిపల్లె, ఆరోగ్యపురం, దాదంవారిపల్లె, రైల్వే స్టేషన్, చేనేతనగర్, చింతమాకులపల్లె, పూసావారిపల్లె, కురబలకోట, కంటేవారిపల్లె, తెట్టు తదితర గ్రామాల్లోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

క్రీస్తు జీవితం త్యాగాలకు ప్రతీక

పెద్దతిప్పసముద్రం: ఏసు క్రీస్తు జీవితం త్యాగాలకు ప్రతీక అని, ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, ఆదరణ, సేవా భావాలు కలిగి వుండాలని పాస్టర్ జైదీప్‌రాజా హితోపదేశం చేసారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా సోమవారం మండలంలోని కందుకూరు, పీటీఎం, రంగసముద్రం, కొత్తపల్లి, పులికల్లు, అంకిరెడ్డిపల్లి, బురుజుపల్లి, కాట్నగల్లు గ్రామాల్లోని మందిరాల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



జేసీఎం చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ

ఏసుమార్గం ఆచరణీయం

మదనపల్లె : ఏసుక్రీస్తు చూపిన మార్గం మానవాళికి ఆచరణీయమని వైఎస్సార్ సీపీ జిల్లా క్రైస్తవవిభాగం అధ్యక్షులు బోనాసి జాన్‌బాబు పేర్కొన్నారు. సోమవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా పట్టణంలోని పీటర్‌రాక్ చర్చిలో వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చర్చి పాస్టర్.జాన్‌బాబు మాట్లాడుతూ..క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఏసు ప్రభు మార్గంలో దయ, కరుణ, ప్రేమతో ముందుకు నడవాలని బోధించారు. వేడుకల్లో భాగంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం: మండలంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. వెలిగల్లు, పెద్దమండ్యం, తురకపల్లె చర్చిల్లో ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిలు ప్రత్యేక అలంకరణతో కళకళలాడాయి. వెలిగల్లు చర్చి వద్ద అన్నదానం చేశారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె, వెంకోజిగారిపల్లె, గుండ్లబురుజు, రాచవేటివారిపల్లె, రెడ్డివారిపల్లె, బండ్లపై, ముష్టూరు, అగ్రహారం, సామకోటివారిపల్లె, వెంగంవారిపల్లె, ఎగువమాచిరెడ్డి, దిగువమాచిరెడ్డి గారిపల్లెల్లోని చర్చిల్లో ఏసుక్రీస్తు జన్మదిన సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి పాస్టర్లు దైవసందేశాలను వినిపించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తుమార్గంలో నడవాలని బోధించారు.

కలికిరిలో..

కలికిరి: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని అన్ని చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలికిరి పట్టణ పరిధిలోని సీఎస్ఐ, ఇందిరమ్మకాలని, వెంకటేశ్వరపురం, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధిలతో పాటు, వివిధ గ్రామాలలో వెలసిన చర్చిలలో పాస్టర్‌లు క్రీస్తు జన్మ వృత్తాంతం, క్రీస్తు శాంతి సందేశాలను ప్రజలకు వివరించారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండలంలో సోమవారం భక్తిశ్రద్ధలతో క్రిస్టమస్ వేడుకలను జరుపుకున్నారు. తంబళ్లపల్లె, పంచాలమర్రి, ఉప్పులూరివాండ్లపల్లె, చింపిరెడ్డిగారిపల్లె చర్చిలలో కేకులు కట్‌చేసి పంచి పెట్టారు. పాస్టర్ పాల్‌రాజు ఏసుప్రభు సందేశాన్ని ఉపదేశించారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సిఎస్ఐ చర్చి, టిఎం వ్యాలీ, చింతపర్తిలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మేరి మాట్లాడుతూ ఏసుక్రీస్తు చెప్పినట్లుగా సమాజంలో ప్రతి ఒక్కరూ సేవామార్గాన్ని ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రైస్తవులు ప్రభచురణ్, జోసెఫ్, రవి, ఆనంద, తదితరులు పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ : స్వార్థం వీడి మంచి మార్గంలో ముందుకు నడవడమే పుణ్యమార్గమని పాస్టర్ శేఖరయ్య అన్నారు. సోమవారం క్రిస్మస్ పురస్కరించుకుని మండలంలోని కోన పంచాయతీ గంగిరెడ్డిగారిపల్లె, బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లె, కలకడ పంచాయతీ కె. కొత్తపల్లె, తదితర ప్రార్థన మందిరాల్లో (గిల్గలాలు) ప్రభువు మాటలను వినిపించారు.

ములకలచెరువులో..

ములకలచెరువు: మండలంలోని చర్చల్లో సోమవారం క్రైస్తవులు క్రిస్మస్ పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. మత గురువులు ప్రార్థనలు చేయించి బైబిల్ ప్రాముఖ్యతను వివరించారు.



మదనపల్లె : క్రిస్మస్ వేడుకల్లో బోనాసి జాన్‌బాబు



మదనపల్లె: ఆకట్టుకున్న ఏసు జననం సెట్టింగ్



రామసముద్రం : పేదలకు దుస్తులు పంపిణీ



గుర్రంకొండలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు











కేవీపల్లె: వగళ్ల చర్చిలో సందేశం ఇస్తున్న పాస్టర్లు, పీలేరు: ఏసీఎల్‌ఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం , పెద్దతిప్పసముద్రం: కందుకూరులో క్రీస్తు బోధనలు, కలకడ : కొత్తపల్లెలో ప్రభువు వ్యాఖ్యలను వినిసిస్తున్న పాస్టర్లు , ములకలచెరువు చర్చిలో ప్రార్థనలు

నాబార్డ్ గ్రామీణమేళాను ఆదరించండి

డీడీఎం విజయవిహారి

మదనపల్లె : నాబార్డ్ సహకారంతో విమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో చిన్న, సూక్ష్మ ఉత్పత్తిదారులు, వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు పట్టణంలోని జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో ప్రారంభించిన గ్రామీణ మేళాను ప్రజలు ఆదరించాలని జిల్లా డెవలప్‌మెంట్ ఆఫీసర్ విజయవిహారి కోరారు. సోమవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతితో కలిసి డీడీఎం మేళాను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చిన్న, సూక్ష్మ ఉత్పత్తిదారులు, వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు నాబార్డ్ అనేకరకాల కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక అభివృద్ధిని పెంపొందించేందుకు మేళాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన విభిన్న హస్తకళాకారులు తమ ఉత్పత్తుల విక్రయాలకు స్టాల్స్ ఏర్పాటు చేసుకుని, అందరికీ అందుబాటు ధరల్లో విక్రయించడం అభినందనీయమన్నారు. విమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ కుళ్లాయమ్మ మాట్లాడుతూ.. మహిళా సంఘాల ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేసేందుకు జిల్లాలో మొదటిసారిగా గ్రామీణ మేళాను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఆరురోజుల పాటు జరిగే గ్రామీణ మేళాను ప్రజలు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, పేస్ డైరెక్టర్ వి.యస్.రెడ్డి, యం.ఉత్తమేశ్వరరావు, డబ్ల్యూడీఎస్ కోఆర్డినేటర్ యస్.రవికుమార్, నిర్వాహకులు బుద్దపల్లెరమేష్, జాబీర్, ఖాదర్‌వల్లి, హస్తకళాకారులు బాలసుబ్రహ్మణ్యం, సుజాత, సుహాసిని, రమణి తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ మేళాలో నేత ఉత్పత్తులు పరిశీలిస్తున్న నాబార్డ్ డీడీఎం విజయవిహారి

రూ. 1.40 కోట్లతో తారు రోడ్డు నిర్మాణం

పీలేరు రూరల్ : మండలంలోని మేళ్లచెరువు పంచాయతీ వడ్డిపల్లెకు రూ. 1.40 కోట్లతో తారు రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ చిన్నకొండయ్య, ఎంపీటీసీ కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. సోమవారం రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 సంవత్సరాల నాటి కల నేటితో నెరవేరిందని తెలిపారు. మంచాలమంద రోడ్డు నుంచి వయా రెడ్డివారిపల్లె మీదుగా వడ్డిపల్లెకు 1.5 కిలోమీటరు తారు రోడ్డు మంజూరు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు పారంభించడంతో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అమరనాథరెడ్డి, సురేంద్రరెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, రవికుమార్‌నాయుడు, వెంకటరమణ, బొజ్జయ్యనాయుడు, కృష్ణయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఘనంగా వాజ్‌పేయి జయంతి

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో సోమవారం బీజేపీ జిల్లా సెక్రటరీ మల్లెం శివయ్య ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను నిర్వహించారు. వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

నేటితరం యువతకు ఆదర్శం

కలకడ : మాజీ ప్రధాన మంత్రి అటల్‌బిహారీ వాజ్‌పేయి నాడు వేసిన బాటలు నేటి యువతరానికి ఆదర్శమని పీలేరు బీజేపీ కన్వీనర్ డాక్టర్ పాత్తూరి. శ్రీకాంత్‌నాయుడు అన్నారు. సోమవారం మండల బీజేపీ అధ్యక్షుడు ఆంజినేయులునాయుడు ఆధ్వర్యంలో మండలంలో వాజ్‌పేయి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులురెడ్డి, ఆంజినేయులు, మూర్తి, మల్లికార్జున, మనికంఠ, నవీన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వాటర్‌ప్లాంట్ వితరణ



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న బీఎస్ఎఫ్ ఐజీ డీకే శర్మ

కలికిరి: మండలంలోని పత్తేగడ గ్రామం పాళెం వద్ద నున్న బీఎస్ఎఫ్ కేంద్రం ఆధ్వర్యంలో కొర్లకుంట సమీపంలోని చౌడేశ్వరి వృద్ధాశ్రమానికి వాటర్‌ప్లాంట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ ఐజీ డీకే శర్మ సోమవారం వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అలాగే వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. నిరాశ్రయులైన వృద్ధులను ఆదుకున్న అక్కున చేర్చుకుంటున్న ఆశ్రమ నిర్వాహకులను బీఎస్ఎఫ్ అధికారులు అభినందించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ కమాండెంట్ వీకే యాదవ్, డిప్యూటీ కమాండెంట్ అశోక్ చౌదరి, ఆశ్రమ నిర్వాహకులు ఆదినారాయణ రెడ్డి, వైద్యాధికారులు శ్రీధర్, సమీరా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ వైద్య సేవలు

వాల్మీకిపురం: కార్పొరేటు వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలో సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, వైద్యుల పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, రోగికి ఏ సమస్యపై వచ్చినా రెఫర్ చేయకుండా వైద్యం అందించాలన్నారు. 50 పడకల ఆసుపత్రి పనులు కూడా పూర్తి కావస్తున్నాయని, త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేసి, ఆరోగ్యశ్రీ, విలేజ్ క్లినిక్, ఆరోగ్య సురక్ష, 108, 104 ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్ రాయల్, కువైట్ శంకరాచారి, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, డాక్టర్ శివాని పాల్గొన్నారు.



వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే చింతల

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

మదనపల్లె : వాల్మీకిపురంలో విద్యుత్‌షాక్‌తో మరణించిన నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో అధికారులు తమ తప్పు కప్పిపుచ్చుకునేందుకు పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసు నమోదు లేకుండా చనిపోయిన నాగరాజు కుటుంబానికి అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. విద్యుత్‌షాక్‌తో మరణించిన ఎవరికైనా ట్రాన్స్‌కో రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలనే నిబంధన ఉందని, ఇది కూడా ఆ కుటుంబానికి దక్కకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన నాగరాజు ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టమాటా పంటకు ఆకుమాడు తెగులు

గుర్రంకొండ: ఇటీవల వరుస తుపానుల ప్రభావంతో టమాటా పంటకు ఆకుమాడు తెగులు సోకింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో తెగుళ్లతో టమాటా తోటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుత సీజన్‌లో మండలంలో 1750 హెక్టార్లలో టమాటా తోటలు సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తెగుళ్లు సోకిన రెండుమూడు రోజులకే తోటలు నల్లగా మారిపోతున్నాయి. చెట్టు మొదలు భాగం నుంచి పై వరకు ఆకు నల్లగా మారిపోతోంది. దీని ప్రభావంతో చెట్టుకు ఉన్న కాయలు మొత్తం పిట్టల్లా రాలిపోయి కాలువల్లో పడిపోతున్నాయి. అలాగే తోడు పూత పిందె మొత్తం వాడిపోయి రాలిపోతోంది. తెగుళ్ల నివరాణకు ఎకరం తోటకు మందుల పిచికారి చేయాంటే రూ.11 వేలు వరకు ఖర్చు అవుతోందని రైతులు అంటున్నారు. మారిన వాతావరణ ప్రభావంతో ఉదయం, సాయం కాలం వేళల్లో కురుస్తున్న మంచు ప్రభావంతో ఇలాంటి తెగుళ్లు ఎక్కువగా సోకుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో తోటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

